ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తమిళనాడు

TAMILNADU

శుక్రవారం 8 మార్చి 2024







అమ్మవారి సారెను ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఏజే శేఖర్, సభ్యులు తదితరులు

# నేత్రపర్వంగా చక్రస్నానం

● ద్వజావరోహణంతో ముగిసిన అమ్మవారి బ్రహ్మోత్సవాలు

చక్రస్నానం సేవలో వేద పండితులు, ఏజే శేఖర్ తదితరులు





సుగంధ ద్రవ్యాల అలంకరణతో పద్మావతీ దేవి

ప్యారీస్, మార్చి 7 : స్థానిక టీనగర్ జీఎన్ చెట్టి రోడ్డులోని పద్మావతీ అమ్మవారి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం సాయంత్రం ధ్వజావరోహణంతో నేత్రపర్వంగా ముగిశాయి. పద్మావతీ అమ్మవారి ఆలయంలో గత నెల 28న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఆ రోజు నుంచి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, ఉదయం సాయంత్రం వివిధ వాహనాలపై విహారం తదితర సేవలను ఆలయ వేద పండితులు నిర్వహించారు. ఈ పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకాగా, ఆలయం తరఫున ప్రసాదాలు పంపిణీ చేశారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన గురువారం తెల్లవారుజాము 5.30 గంటలకు వెంకటనారాయణ రోడ్డులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సుప్రభాత సేవ అనంతరం టీటీడీ స్థానిక సలహామండలి అధ్యక్షుడు ఏజే శేఖర్ నేతృత్వంలో శ్రీవారి తరఫున అమ్మవారికి సారె సమర్పించే క్రతువు గోవిందనామస్మరణ, అర్చకుల మంత్రోచ్చారణ, మేళతాళాల నడుమ ప్రారంభమైంది. అమ్మవారికి పట్టు వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు తదితర పూజాసామగ్రిని ఏజే శేఖర్, కమిటీ సభ్యులు శిరస్సుపై ఉంచుకుని ఊరేగింపుగా పద్మావతీ అమ్మవారి ఆలయానికి చేర్చారు. ఆ ఆలయంలో ఉదయం తొమ్మిది గంటలకు పద్మావతీ అమ్మవారికి శాస్త్రోక్తంగా తిరుమంజనం, హారతి సేవలు నిర్వహించి, సాయంత్రం ఏడుగంటలకు ధ్వజావరోహణం చేసి బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ప్రకటించారు. ఏజే శేఖర్ సతీమణి జయశ్రీ, ఆలయ సూపరింటెండెంట్ పుష్పలత, సభ్యులందరూ సాంప్రదాయ వస్త్రాలు ధరించి ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం సాయంత్రం నాలుగు నుంచి రాత్రి 7.30 గంటల వరకు పుష్పయాగం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు.

# మహిళాభ్యుదయమే మా ధ్యేయం!

● కొళత్తూరు సభలో సీఎం స్టాలిన్



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళా సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేసిందని, ప్రస్తుతం ఆ పథకాలు సత్ఫలితాలిస్తున్నాయని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. కొళత్తూరులో గురువారం సాయంత్రం అనితా అచీవర్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రూ.36.99 కోట్లతో పూర్తయిన అభివృద్ధి పథకాల ప్రారంభోత్సవం, రూ.205 కోట్లతో చేపట్టనున్న పథకాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం విద్యార్థులకు సహాయాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మహిళలకు వెలుగుబాట పయనం, గృహిణులకు కలైంజర్ మహిళా సాధికారిక నగదు పంపిణీ, ప్రభుత్వ పాఠశాల్లో చదివి డిగ్రీ కోర్సులు చదివే విద్యార్థినుల ఖాతాల్లో వెయ్యి రూపాయలు జమ చేయడం వంటి పథకాలను చూసి ఇతర రాష్ట్రాలు కూడా అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, తంగం తెన్నరసు, పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్.ప్రియ, ఎంపీ కళానిధి వీరాసామి, రాజ్యసభ సభ్యుడు గిరిరాజన్, ఎమ్మెల్యేలు తాయగం కవి, వెట్రి అళగన్, జోసెఫ్ సామువేల్, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 22న ప్రధాని మోదీ రాక



పెరంబూర్, మార్చి 7: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 22వ తేదీ మళ్లీ రాష్ట్రపర్యటనకు రానున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆయన ఈ ఏడాది నాలుగుమార్లు రాష్ట్రం లో పర్యటించగా, ఇప్పుడు ఐదోసారి పర్యటించేందుకు సిద్ధమవుతున్నారు. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో, అన్ని రాజకీయపార్టీలు ఎన్నికలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, మోదీ కూడా ముమ్మర ప్రచారానికి ప్రణాళికలు రూపొందించుకున్నట్లు బీజేపీ వర్గాలు పేర్కొన్నాయి. జనవరిలో 'ఖేలో ఇండియా' పోటీలు ప్రారంభించిన ప్రధాని.. శ్రీరంగం, రామేశ్వరం ప్రాంతాలకు వెళ్లారు. ఫిబ్రవరి 27న అన్నామలై 'ఎన్ మన్...ఎన్ మక్కల్' పాదయాత్ర ముగింపు బహిరంగ సభలో పాల్గొన్న ప్రధాని.. మదురై మీనాక్షి అమ్మవారిని దర్శించుకున్నారు. ఇక, 28వ తేది కులశేఖరపట్టణంలో కొత్త రాకెట్ ల్యాంచ్ పాడ్ నిర్మాణాలకు భూమి పూజలో ప్రధాని పాల్గొన్నారు. అలాగే, ఈ నెల 4వ తేది నగరంలోని నందనం వైఎంసీఏ మైదానంలో జరిగిన బీజేపీ బహిరంగ సభలోనూ పాల్గొన్న విషయం తెలిసిందే.

# ఎట్టకేలకు డీఎంకేతో మక్కల్ నీదిమయ్యం చర్చలు



చెన్నై, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధిష్ఠానం సీట్ల సర్దుబాట్లపై విధించిన గడువు పూర్తికానున్న సమయంలో ప్రముఖ నటుడు కమల్ హాసన్ నాయకత్వంలోని మక్కల్ నీదిమయ్యం (ఎంఎన్‌ఎం) సీట్ల సర్దుబాట్లపై ఆ పార్టీ అధిష్ఠానంతో చర్చలు ప్రారంభించింది. గత మూడు వారాలుగా డీఎంకే కూటమిలో మక్కల్ నీదిమయ్యం చేరుతుందో లేదో, ఆ పార్టీ ఆశించిన సీట్లు కేటాయిస్తారో లేదో అంటూ పలు అనుమానాలు బయలుదేరాయి. కాంగ్రెస్‌కు కేటాయించే సీట్లలో ఒకదానిని మాత్రమే ఎంఎన్‌ఎంకు కేటాయిస్తారని కూడా ఊహాగానాలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో ఎంఎన్‌ఎం నేత కమల్‌హాసన్ తన సినీ రంగ సన్నిహితుడు, మంత్రి ఉదయనిధితో తనకున్న పలుకుబడిని ఉపయోగించడంతో సీట్ల సర్దుబాట్లపై చర్చలు గురువారం ప్రారంభమయ్యాయి. ఎంఎన్‌ఎం ప్రధాన కార్యదర్శి అరుణాచలం తదితర నాయకులు డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయానికి వెళ్ళి పొత్తును ఖరారు చేసుకునే దిశగా తొలివిడత చర్చలు జరిపారు. ఈ చర్చలలో ఎంఎన్‌ఎం పోటీ చేయడానికి అనువైన నియోజకవర్గాలు గురించి రెండు పార్టీల నాయకులు చర్చించారు. అదే సమయంలో డీఎంకే అధిష్ఠానం మిత్రపక్షాలకు సీట్ల కేటాయింపులు దాదాపు ఖరారవుతున్న దశలో ఒక సీటు మాత్రమే కేటాయించే అవకాశం ఉందని ఎంఎన్‌ఎం నేతలకు స్పష్టం చేసింది. మలి విడత చర్చలు జరిగిన తర్వాత సీట్ల సంఖ్య రెండుకు చేరుతుందని ఎంఎన్‌ఎం నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మలి విడత చర్చలలో ఎంఎన్‌ఎం నేత కమల్ హాసన్ డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్‌ను కలుసుకుంటారని తెలుస్తోంది. గురువారం ఉదయమే కమల్ హాసన్ అరివాలయానికి వస్తారని పుకార్లు వ్యాపించడంతో మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో గుమికూడారు. చివరకు పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణాచలం ఇతర నాయకులు మాత్రమే రావటంతో వీరంతా నిరాశగా వెనుదిరిగారు.

**4 సీట్ల కోసం పట్టు...**

లోక్‌సభ ఎన్నికల్లో కనీసం నాలుగు నియోజకవర్గాలలో పోటీ చేయాలని ఎంఎన్‌ఎం నేతలంతా పట్టుబడుతున్నారు. ఆ దిశగానే డీఎంకే అధిష్ఠానంతో చర్చలు జరపాలని, నాలుగు సీట్లు లభించకపోతే ఎప్పటిలా ఒంటరిగానే పోటీ చేయాలని కూడా కమల్‌హాసన్‌పై ఒత్తిడి చేస్తున్నారు. ప్రస్తుతం ఎంఎన్‌ఎం నాయకులు కోయంబత్తూరు, మదురై, సౌత్ చెన్నై, రామనాథపురం లోక్‌సభ నియోజకవర్గాలు కేటాయించాలని ప్రతిపాదిస్తున్నట్లు సమాచారం. అయితే కోయంబత్తూరు నియోజకవర్గాన్ని మాత్రమే డీఎంకే కేటాయిస్తుందని చెబుతున్నారు.

## ఓటుకు నోట్లు, కానుకలపై

# ఫిర్యాదు చేయండి

ఈసీ సత్యప్రదసాహు పిలుపు ● 1.70లక్షల ఈవీఎంలు సిద్ధం



చెన్నై, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో నగదు, కానుకల పంపిణీపై సీ-విజిల్ యాప్ ద్వారా వీడియో తీసి ఫిర్యాదు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రదసాహు పిలుపునిచ్చారు. అభ్యర్థుల అవినీతి అక్రమాలపై నిఘా వేయడంలో ఎన్నికల అధికారులకు స్థానిక ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నగరంలో గురువాఆరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావటానికి పది రోజుల ముందు కడా ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు చేసుకోవచ్చునని, ఆన్‌లైన్ ద్వారా ఈ మార్పులు సాధ్యమేనని చెప్పారు. ఈవీఎంలలో పోలయ్యే ఓట్ల సంఖ్యలో తారతమ్యాలను అరికట్టేందుకే ప్రతి నియోజకవర్గంలో ఐదు వీవీ పేడ్లలో పోలైన ఓట్లను లెక్కిస్తామని చెప్పారు. రాజకీయ పార్టీ సమక్షంలోనే ఇది జరుగుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించినంతవరకూ ముందస్తు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని, ఎన్నికలకు అవసరమైన ఈవీఎంలు సిద్ధంగానే ఉన్నాయని, ఎన్నికల సిబ్బందిని కూడా సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఈ ఎన్నికలకు 68,154 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, అధికపక్షంగా 1500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, కొన్ని చోట్ల 800 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు. ఈ ఎన్నికల కోసం లక్షా 70 వేల బ్యాలెట్ యూనిట్లు, 93 వేల కంట్రోల్ యూనిట్లు, 99 వేల వీవీ ప్యాడ్‌లు సిద్ధం చేశామని, పరిమితికి మించిన సంఖ్యలో అభ్యర్థులు పోటీ చేసే ప్రాంతాల్లో మూడు ఈవీఎంలు అవసరమవుతాయని చెప్పారు. ఎన్నికల్లో నగదు బట్వాడా, కానుకల పంపిణీ నిరోధించేందుకు సీ -విజిల్ యాప్‌ను ప్రజలు ఉపయోగించాలని, ఎక్కడ అవకతవకలు జరిగినా వెంటనే వీడియో తీసి పంపించాలన్నారు. ఫిర్యాదు చేసే వివరాలను గోప్యంగా ఉంచుతామని, కనుక ప్రజలు నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చునని భరోసా ఇచ్చారు. ఈవీఎంలో ఏ మీట నొక్కినా ఒకే పార్టీకి లేదా ఒకే అభ్యర్థికి ఓట్లు పడతాయని వస్తున్న ఆరోపణలో వాస్తవం లేదని, ఎన్నికలకు ముందే ఈవీఎంల పనితీరును అధికారులు, రాజకీయ నాయకుల సమక్షంలో పరిశీలించిన తరువాతే పోలింగ్ కేంద్రాలకు తరలిస్తున్నామని సత్యప్రద సాహు తెలిపారు. లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రస్తుతం సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు భద్రత కల్పిస్తున్నామని, సాయుధ దళాలను, పారా మిలిటరీ దళాలను కూడా వినియోగించనున్నామని ఆయన తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద, సమీప ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, వీటికితోడు నిఘా అధికారులు అప్రమత్తంగా ప్రతిపోలింగ్ కేంద్రం వద్ద తనిఖీలు చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత రశీదులు, ధ్రువీకరణ పత్రాలు లేకుండా భారీగా నగదును తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఆ దిశగా నిఘా విభాగం అధికారులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు కూడా చేపడతారని చెప్పారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా జరిపేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

## శివరాత్రి కోసం

# ముస్తాబైన ఆలయాలు

● జాగరణకు సిద్ధమవుతున్న భక్తులు



విద్యుద్దీపాలంకరణతో మైలాపూరు కపాలీశ్వరాలయ రాజగోపురం



మైలాపూరుఆలయ తీర్థకొలను ప్రాంతం

ప్యారీస్, మార్చి 7: మహాశివరాత్రి వేడుకల కోసం రాష్ట్రవ్యాప్తంగా శివాలయాలు ముస్తాబయ్యాయి... మహాశివరాత్రిని కోలాహలంగా శుక్రవారం జరుపుకోనున్నారు. అందరి జీవితాల్లో వెలుగులు నింపేలా భక్తులు శైవ దర్శనం కోసం శివాలయాలకు పోటెత్తనున్నారు. శివరాత్రి సందర్భంగా భక్తులు జాగరణ చేసి శివాలయాల్లో నిర్వహించే నాలుగు జాముల పూజలు, అభిషేకాలు, అర్చనలు తదితర పూజల్లో పాల్గొననున్నారు. రాజధాని నగరం చెన్నైలో ఉన్న శివాలయాల్లో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక వసతులు సిద్ధం చేశారు.

**మైలాపూర్...**

మైలాపూర్‌లో ప్రసిద్ధిగాంచిన కపాలీశ్వర ఆలయంలో హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 6 నుంచి శనివారం ఉదయం 6 గంటల వరకు స్వామివారికి ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలను దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రారంభిస్తారు. కార్యక్రమంలో భాగంగా ఆధ్యాత్మిక ప్రవచనకర్తల ప్రసంగాలు, భక్తిపాటల సంగీతం, భజన తదితరాలు నిర్వహించనున్నారు.



కోయంబత్తూరు సమీపంలోని వెళ్లయంగిరి కొండపై శివలింగాలు

**కోయంబేడు...**

కోయంబేడులోని కురుంగాలీశ్వర ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు అభిషేకాలు నిర్వహిస్తారు. సాయంత్రం ప్రదోష అభిషేక పూజలను శివాచార్యులు లాంఛనంగా ప్రారంభిస్తారు. రాత్రి 7 నుంచి మరుసటిరోజు ఉదయం వరకు నాలుగు జాముల పూజలు నిర్వహిస్తారు. రాత్రంగా జాగారణ నిమిత్తం భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారని భావిస్తున్న ఆలయ యజమాన్యం దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటుచేశారు.

**పాడిలో...**

విల్లివాక్కం నియోజకవర్గ పరిధి పాడిలో ఉన్న తిరువల్లీశ్వరర్ శివాలయంలో అభిషేకాలతో మాసి మాసం మహాశివరాత్రి వేడుకలు ప్రారంభమవుతాయి. రాత్రి 9, అర్ధరాత్రి 12, తెల్లవారుజామున 2,4 గంటలకు నిర్వహించనున్న ప్రత్యేక పూజల్లో పాల్గొనే భక్తుల కోసం పటిష్ట భద్రత కూడా ఏర్పాటుచేశారు. రాత్రంతా ఆలయ ప్రాంగణంలో భరతనాట్యం, ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

**తిరువొత్తియూర్...**

తిరువొత్తియూర్ త్యాగరాజస్వామి ఆలయంలో కొలువైన శివపరమాత్ముడికి ఆలయ మహా మండపంలో నాలుగు జాముల పూజలు నిర్వహిస్తారు. ఆదిపురీశ్వర పెరుమాళ్‌కు ప్రత్యేకంగా రాత్రి 11 గంటలకు 108 శంఖాలతో అభిషేకం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అదే విధంగా తిరువాన్మియూర్‌లోని మరుందీశ్వర ఆలయం, షావుకారుపేట తంగశాల వీధిలో ఉన్న ఏకాంబరేశ్వర ఆలయం, తిరువణ్ణామలైలో ప్రసిద్ధిచెందిన అరుణాచలేశ్వర ఆలయం, తంజావూరు బృహదీశ్వర ఆలయం, రామనాథపురం జిల్లా రామేశ్వరంలోని పర్వతవర్థిని సమేత రామనాథ స్వామి ఆలయంలో, తిరువానైకావల్ జంబుకేశ్వరస్వామి ఆలయం, స్థానిక వ్యాసర్పాడి రవీశ్వరర్ ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

**కొరట్టూరులో...**

కొరట్టూరులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 6.30 గంటలకు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి అభిషేకాలు, సహస్రనామ రుద్రాభిషేకం, స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

**సహస్ర రుద్రాభిషేకం...**

స్థానిక షావుకారుపేట వరదాముత్తుయప్పన్ వీధిలోని నారాయణ గురవయ్య చెట్టి సత్రంలో వైశ్య గురు సేవా సమితి ఆధ్వర్యంలో సహస్ర రుద్రాభిషేకం సాయంత్రం 3 గంటలకు నిర్వహించనున్నారు. వాసవి క్లబ్ షావుకారుపేట చెన్నై, వనిత క్లబ్‌లు సంయుక్తంగా నిర్వహించనున్న ఈ పూజల్లో స్వర్ణ లింగానికి మహా అభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## సమాచార ధ్వని

### రేపు ఆధ్యాత్మిక ఉపన్యాసం

ఐసిఎఫ్, మార్చి 7: కశ్మీర్ ఖ్యాతిని వివరించే 99వ కార్యక్రమంలో భాగంగా 'కశ్మీర్ శైవంలో ఉన్న అంతరిక్ష పరిశోధన' అనే శీర్షికన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం శనివారం రాత్రి 7 గంటలకు జరుగనుంది. కంచి మఠం ఆధ్వర్యంలో 14 రోజులకు ఒకసారి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ శనివారం కార్యక్రమాన్ని సైమా ల్యాబ్స్ నిర్వహించనుంది. డా.కార్తీక్ రమేష్ ప్రత్యేక ఉపన్యాసం చేయనున్నారు. ఈ కార్యక్రమాలను నేరుగా వీక్షించలేని వారు మాధ్యమ ధర్మ సమాజం యూట్యూబ్, కంచి కామకోటి టీవీ, ఫేస్‌బుక్, ఎక్స్ పేజీల్లో వీక్షించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

### గ్రూప్-1 పరీక్షా ఫలితాల విడుదల

పెరంబూర్, మార్చి 7: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షా ఫలితాలను తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) గురువారం విడుదల చేసింది. గత ఏడాది అక్టోబరు 10 నుంచి 13వ తేది వరకు ఈ పరీక్షలు జరిగాయి. ఉత్తీర్ణులైన వారికి ఈ నెల 26 నుంచి 28వ తేది వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

### 216 మంది ట్రాఫిక్ పోలీసుల బదిలీ

ఐసిఎఫ్, మార్చి 7: నగరంలో 216 మంది ట్రాఫిక్ పోలీసులను బదిలీ చేశారు. బదిలీకి సంబంధించి అదనపు కమిషనర్ సుధాకర్ ఇటీవల ఎగ్మూర్ రాజారత్నం స్టేడియంలో అభిప్రాయ సేకరణ శిబిరం నిర్వహించారు. 300 మందిని ఆహ్వానించగా బదిలీ కోరుతూ 216 మంది వినతిపత్రం అందజేశారు. వారిని వివిధ శాఖలకు బదిలీ చేస్తూ సుధాకర్ ఉత్తర్వులు జారీచేశారు.

### బేకరీ పదార్థాల తయారీపై శిక్షణ

ఐసిఎఫ్, మార్చి 7: ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బేకరీ పదార్థాల తయారీపై ఈ నెల 13 నుంచి 15వ తేది వరకు శిక్షణా తరగతులు జరుగనున్నాయి. ముడిపదార్థాలు, ఉపకరణాలు, యంత్రాల వినియోగం, బిస్కెట్లు, కుకీస్, బన్ను, రస్క్, పఫ్స్, కేక్ తయారీపై నిపుణులు వివరించనున్నారు. వివరాలకు 044-22252081, 8668100181 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

### నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, మార్చి 7: స్థానిక టి.నగర్, వ్యాసర్పాడి ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. వళ్లువర్‌కోట్టం సమీపంలోని టి.నగర్ ఉపవిద్యుత్ కేంద్ర ప్రాంగణం, వ్యాసర్పాడి ఉపవిద్యుత్ కేంద్రం ప్రాంగణాల్లో జరిగే ఈ గ్రీవెన్స్‌లో ఆయా ప్రాంత ప్రజలు పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని అధికారులు సూచించారు.

### వడపళని ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు

ఐసిఎఫ్, మార్చి 7: స్థానిక వడపళని సుబ్రమణ్య స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు శుక్రవారం జరుగనున్నాయి. రాత్రి 8.30 నుంచి వేకువ జామున 4.30 గంటల వరకు నాలుగు జాముల పూజలు నిర్వహించనున్నారు. ఒక్కో జాము అభిషేక వేళల్లో రుద్రపారాయణం, భజనలు జరుగనున్నాయి. రాత్రి 7.30 గంటల నుంచి భక్తిగీతాల కచ్చేరి నిర్వహించనున్నారు.

### 28 పంచాయతీలకు క్రీడా ఉపకరణాలు

ఐసిఎఫ్, మార్చి 7: పూందమల్లి యూనియన్‌కు చెందిన 28 పంచాయతీలకు రూ.21.60 లక్షలతో క్రీడా ఉపకరణాలను అందజేశారు. యువత సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పూందమల్లి తాలూకా అభివృద్ధి కార్యాలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పూందమల్లి ఎమ్మెల్యే కృష్ణస్వామి 28 పంచాయతీలకు క్రీడా ఉపకరణాలు అందజేశారు.

### నీలాంగరై బీచ్‌లో నేటినుంచి వాలీబాల్ పోటీలు

చెన్నై, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక నీలాంగరై బీచ్‌లో మెరీనా బీచ్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ బీచ్ వాలీబాల్ ప్రోటూర్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ క్లబ్ కార్యదర్శి ఏజే మార్టిన్ తెలిపారు.. ఆలిండియా బీచ్ వాలీబాల్ కాంపిటీషన్స్‌గా పిలిచే ఈ పోటీలు ఈ నెల 8 నుండి 10 వరకు జరుగనున్నాయి. ఇందులో తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణా, ఆంధ్ర, పుదుచ్చేరి, గోవా, డామన్ దయ్యూ తదితర రాష్ట్రాలకు చెందిన 28 జట్లు పాల్గొంటున్నాయి. పురుషుల విభాగంలో 15 జట్లు, మహిళల విభాగంలో 12 జట్లు పాల్గొంటాయి. లీగ్ , నాక్ అవుట్ పద్ధతుల్లో ఈ బీచ్ వాలీబాల్ పోటీలు జరుగుతాయి. ఈ పోటీలు ఉదయం ఎనిమిది నుండి మధ్యాహ్నం, 12 గంటల వరకు, మళ్ళీ మధ్యాహ్నం 3 నుండి రాత్రి 10 గంటల వరకు నిర్వహించనున్నారు.

### తమిళంలో నేమ్ బోర్డు ఏర్పాటుకు అవకాశం

పెరంబూర్, మార్చి 7: రాష్ట్రంలో దుకాణాలు, వాణిజ్య కాంప్లెక్స్‌ల్లో తమిళంలో నేమ్ బోర్డు ఏర్పాటుకు అవకాశం కల్పించినట్లు మంత్రి సామినాథన్ తెలిపారు. తమిళ భాషాభివృద్ధిలో భాగంగా పలు చర్యలు చేపడుతున్న రాష్ట్రప్రభుత్వం, దుకాణాలు, వాణిజ్య కాంప్లెక్స్ తదితరాల్లో తమిళంలో నేమ్ బోర్డులు ఏర్పాటుచేయాలని సూచించింది. ఈ విషయమై నగరంలో గురువారం మంత్రి విలేఖరులతో మాట్లాడుతూ... ప్రభుత్వ నిబంధనలు పాటించాలని వ్యాపారులను సూచించామన్నారు. వారి విజ్ఞప్తి మేరకు నేమ్ బోర్డుల ఏర్పాటుకు అవకాశం కల్పించినట్లు, మే 1వ తేది అన్ని దుకాణాలు, వాణిజ్య కాంప్లెక్స్‌లో తమిళంలో నేమ్ బోర్డులు తప్పనిసరిగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని మంత్రి హెచ్చరించారు.

### 10 నుంచి అన్నాడీఎంకే ఆశావహులకు ఇంటర్వ్యూలు

పెరంబూర్, మార్చి 7: లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసేందుకు దరఖాస్తు చేసుకున్న ఆశావహుల ఇంటర్వ్యూలు ఈ నెల 10,11 తేదీల్లో నిర్వహించనున్నట్లు అన్నాడీఎంకే ఒక ప్రకటనలో తెలిపింది. బుధవారంతో దరఖాస్తు స్వీకరణ గడువు ముగియగా సుమారు 2,400 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి రాయపేటలోని ప్రధాన కార్యాలయంలో ఈ నెల 10,11 తేదీల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అభ్యర్థులు తాము చెల్లించిన డిపాజిట్ రసీదుతో హాజరుకావాలని పార్టీ ప్రధాన కార్యాలయం ప్రకటనలో తెలిపింది.

### రేపు ఎస్కేడీటీ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం

ప్యారీస్, మార్చి 7: స్థానిక విల్లివాక్కం శ్రీ కనకదుర్గ తెలుగు ప్రాథమిక పాఠశాల (ఎస్కేడీటీ) 77వ వార్షికోత్సవం శనివారం మహోన్నత పాఠశాల ప్రాంగణంలో జరుగనుంది. ఎస్కేడీటీ పాఠశాలల అధ్యక్షుడు ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి, ఉపాధ్యక్షుడు, కరస్పాండెంట్ డా.సీఎం కిషోర్ పర్యవేక్షణలో సాయంత్రం 5.15 గంటలకు ప్రారంభం కానున్న వార్షికోత్సవం, క్రీడా దినోత్సవంలో చెన్నై ఆలిండియా రేడియో అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్ జి.లలిత ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని పాఠశాల నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.

# రైల్వే పథకాలను అమలుచేయాలి

● కోవైలో అఖిలపక్షాల వినూత్న నిరసన



ఎడ్ల బండితో నిరసన ర్యాలీలో పాల్గొన్న అఖిలపక్ష నేతలు

ప్యారీస్, మార్చి 7: రాష్ట్రానికి ప్రకటించిన రైల్వే పథకాలను పూర్తిచేయని కేంద్రప్రభుత్వ వైఖరికి నిరసనగా కోవైలో గురువారం సీపీఎం నేతృత్వంలో అఖిలపక్షాలు ఎడ్లబండితో ర్యాలీ నిర్వహిచాఆరు. కోవై పార్లమెంటు సభ్యుడు పీఆర్ నటరాజన్ నేతృత్వంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో ఎండీఎంకే, సీపీఐ, డీపీఐ, కాంగ్రెస్ తదితర పార్టీల ప్రాంతీయ నిర్వాహకులు పాల్గొన్నారు. ధర్నాను ప్రారంభించి ఎంపీ నటరాజన్ మాట్లాడుతూ... రైల్వే శాఖ కోయంబత్తూర్ జిల్లాపై పక్షపాతం చూపుతోందని వ్యాఖ్యానించారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి రాష్ట్రానికొస్తున్న రైళ్లకు కోయంబత్తూర్ జంక్షన్‌గా వ్యవహరిస్తోందని, సేలం రైల్వే డివిజన్ పరిధిలో ఉన్న ఈ ప్రాంతానికి వ్యాపారం, పరిశ్రమలు, విద్య, వైద్య సేవల నిమిత్తం ప్రతిరోజు వేలాది మంది రైళ్లలో ప్రయాణం చేస్తున్నారని అయితే, ఈ రైల్వేస్టేషన్‌లో కనీసవసతులు కల్పించకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అంతేకాకుండా కోవై నుంచి దక్షిణాది జిల్లాలైన దిండుగల్, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, తూత్తుకుడి, రామేశ్వరం తదితర నగరాలకు పొల్లాచ్చి మీదుగా ప్రతిరోజు రాత్రి వేళ రైళ్లు నడపాలని డిమాండ్ చేశారు. కోవై-మేట్టుపాళయం మధ్య జంట రైలు మార్గం ఏర్పాటుచేయాలని, కోవై-సేలం మధ్య మెమో రైలు సేవలను మళ్లీ ప్రారంభించాలని, కోవై-మంగళూరు మధ్య నడిపే రైళ్ల మేట్టుపాళయం వరకు పొడిగించాలని జిల్లా ప్రజలు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారని ఆయన తెలిపారు.

### ప్రధాని మోదీ బాగా నటిస్తున్నారు...!

● మాజీ మంత్రి సెల్లూర్ రాజు

పెరంబూర్, మార్చి 7: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చక్కగా నటిస్తున్నారని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి సెల్లూర్ రాజు ఎద్దేవా చేశారు. మదురైలో అంగన్వాడీ భవనాన్ని గురువారం ప్రారంభించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ... గజినీ మహ్మద్‌లాగా తమిళనాడుపై ప్రధాని ఎన్నిసార్లు దండెత్తినా రాష్ట్ర ప్రజలు నమ్మరన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత ఫొటోలు, పేర్లు వాడుకొని బీజేపీ లబ్ధిపొందాలని చూస్తుందన్నారు. అదే సమయంలో అన్నాడీఎంకే ఓటు బ్యాంక్ కూడా తమ వైపుకు తిప్పుకోవాలని చూస్తోందని ఆయన విమర్శించారు.

### ఒక సీటుకు ఓకే చెప్పాలా వద్దా?

● ఎండీఎంకే సభలో నేతల మల్లగుల్లాలు



ఎగ్మూరులోని తాయగంలో జరిగిన ఎండీఎంకే కార్యనిర్వాహకుల సమావేశంలో పాల్గొన్న ఆ పార్టీ నేత వైగో తదితరులు

చెన్నై, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే అధిష్టానవర్గం ఎప్పటిలా కేటాయించే ఒక సీటును ఆమోదించాలా? వద్దా? అంటూ గురువారం జరిగిన ఎండీఎంకే కార్యనిర్వాహకుల సమావేశంలో నేతల మధ్య తీవ్ర చర్చ జరిగింది. పార్టీ ప్రధాన కార్యదర్శి వైగో అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీఎంకే అధిష్టానానికి ఎండీఎంకే మూడు డిమాండ్లు చేసింది. రెండు లోక్‌సభ నియోజకవర్గాలు కేటాయించాలని లేకుంటే ఒక లోక్‌సభ సీటు, ఒక రాజ్యసభ సీటు కోరింది. అదే సమయంలో గతంలా డీఎంకే గుర్తుపై కాకుండా, ఎండీఎంకే చిహ్నం బొంగరం గుర్తుపై పోటీ చేసేందుకు అనుమతించాలని పట్టుబట్టింది. దీని కారణంగానే ఎండీఎంకేకు ఇంకా సీట్లను ఖరారు చేయడం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జరిగిన ఎండీఎంకే సమావేశంలో డీఎంకే ఇచ్చే ఒక్క సీటుతో సర్దుకుపోవాలా వద్దా అనే విషయంపైనే సుదీర్ఘంగా చర్చ జరిగింది.

### పాత పింఛన్ విధానం... ఆర్థిక శాఖ కార్యదర్శికి హైకోర్టు నోటీసు

పెరంబూర్, మార్చి 7: కొత్త పింఛన్ విధానం రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలుచేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై అఫిడవిట్ దాఖలుచేయాలని హైకోర్టు మదురై బెంచ్ ఆర్థిక శాఖ కార్యదర్శికి నోటీసు జారీచేసింది. వెడచెందూర్‌కు చెందిన ఫెడరిక్ ఏంగెల్స్ ఇదే అంశంతో హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్ తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదావేస్తూ న్యాయమూర్తులు కృష్ణన్‌కుమార్, విజయకుమార్‌తో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

### పెరగనున్న ఎండ తీవ్రత

పెరంబూర్, మార్చి 7: రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరిగే అవకాశముందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఆ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో రానున్న 48 గంటల్లో పొడి వాతావరణం నెలకొంటుందని, పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ పెరిగే అవకాశముందని తెలిపారు. రాజధాని నగరం చెన్నై ఆకాశం మేఘావృతంగా ఉంటూ పగటి ఉష్ణోగ్రతలు 33-34 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 23-24 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

### 5,398 మెగావాట్లకు చేరుకున్న సౌర విద్యుదుత్పత్తి

ఐసిఎఫ్, మార్చి 7: రాష్ట్రంలో సౌరశక్తి విద్యుదుత్పత్తి ఈ నెల 5వ తేది 5,398 మెగావాట్లకు పెరిగింది. రాష్ట్రంలో 7,426 మెగావాట్ల సామర్థ్యంతో పనిచేస్తున్న సోలార్ విద్యుత్ కేంద్రాల్లో వర్షాకాలం మినహా మిగిలిన రోజుల్లో రోజుకు 3,000 మెగావాట్ల విద్యుత్ లభిస్తోంది. ఈ నెల ప్రారంభం నుంచే ఎండ తీవ్రత అధికం కావడంతో 2వ తేది 5,223 మెగావాట్ల విద్యుదుత్పత్తి కాగా, 5వ తేది 5,398 మెగావాట్లకు పెరిగింది. రాబోయే రోజుల్లో ఉత్పత్తి మరింత పెరిగే అవకాశముందని విద్యుత్ బోర్డు తెలిపింది.

### తాగునీటి పనులకు రూ.1,996 కోట్లు

ఐసిఎఫ్, మార్చి 7: నగర ప్రాంత స్థానిక సంస్థల్లో మౌలిక వసతులు కల్పించేందుకు అమృత్ 2.0 పథకం కింద 215 పథకాల అమలుకు రూ.1,996.50 కోట్లు కేటాయించారు. మున్సిపాలిటీ, తాగునీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో రూ.23.59 కోట్లతో పుదుకోట మున్సిపాలిటీలో 24 గంటలు తాగునీరు సరఫరా పథకం అమలుచేయనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సహకారంతో చెన్నై కార్పొరేషన్ 10,13 మండలాల్లో 24 గంటల తాగునీటి సరఫరాకు రూ.760 కోట్లు, కోవై కార్పొరేషన్‌లో మురుగునీరు శుద్ధీకరించి కర్మాగారాలకు సరఫరా చేసేందుకు రూ.245 కోట్లు, మదురైలో ఎంపిక చేసిన వార్డుల్లో తాగునీటి సరఫరాకు రూ.150 కోట్లు, సేలం కార్పొరేషన్‌లో నీటి సరఫరాకు రూ.758.13 కోట్లను కేటాయించినట్లు తాగునీటి సరఫరా శాఖ కార్యదర్శి కార్తికేయన్ తెలిపారు.

### 'బొంగరం' కోసం వైగో పిటిషన్

రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలంటూ ఈసీకి హైకోర్టు ఆదేశం

పెరంబూర్, మార్చి 7: లోక్‌సభ ఎన్నికల్లో 'బొంగరం' గుర్తు కేటాయించాలని ఎన్నికల సంఘానికి రాసిన లేఖను పరిశీలించి గుర్తు కేటాయించేలా ఉత్తర్వులు జారీచేయాలని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో తరపున మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.ఈకేసును విచారించిన హైకోర్టు, గుర్తుకోసం తాజాగా లేఖరాయాలని ఎండీఎంకేకు సూచించింది.ఈ కేసు విచారణ గురువారం ప్రధాన న్యాయమూర్తి గంగాపూర్‌వాలా, న్యాయమూర్తి భరత్ చక్రవర్తిలతో కూడిన ధర్మాసనం విచారించింది.ఈసందర్భంగా, తాజాగా ఎండీఎంకే సమర్పించిన లేఖను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల సంఘం తరపున అఫిడవిట్ దాఖలుచేశారు. ఈసీ వాదన పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం, ఎండీఎంకేకు గుర్తు కేటాయింపులో రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

### కేటాయించే చిహ్నంతోనే పోటీ

● టీఎంసీ నేత జీకే వాసన్

పెరంబూర్, మార్చి 7: తాము కోరిన 'సైకిల్' గుర్తు లభించకపోతే, ఎన్నికల సంఘం కేటాయించిన గుర్తుపై పోటీచేస్తామని తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) అధ్యక్షుడు జీకే వాసన్ తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమిలో టీఎంసీ పోటీచేయనుంది. ఈ మేరకు ఇరు పార్టీల మధ్య ఒప్పందం కుదిరినా, పోటీచేసే సీట్లపై ఇంకా స్పష్టత రాలేదు. అదే సమయంలో బీజేపీ కూటమిలో పోటీచేసే అభ్యర్థులు 'కమలం' గుర్తుపై పోటీచేస్తారని వార్తలు వెలువడుతున్నాయి. ఇలాంటి వార్తలకు ముగింపు పలికేలా జీకే వాసన్ గురువారం నగరంలో విలేఖరులతో మాట్లాడుతూ... తమకు సైకిల్ గుర్తు కేటాయించాలని ఈసీని కోరామని, ఒకవేళ ఆ గుర్తు లభించకపోతే, ఈసీ కేటాయించిన గుర్తుపై పోటీచేస్తామని ఆయన తెలిపారు.

### కొడనాడు బంగ్లాను పరిశీలించిన సీబీసీఐడీ

పెరంబూర్, మార్చి 7: నీలగిరి జిల్లా కొడనాడు బంగ్లాను గురువారం సీబీసీఐడీ ఎస్పీ నేతృత్వంలోని 15 మంది బృందం పరిశీలించింది. కోర్టు ఉత్తర్వుల మేరకు ప్రత్యేక విజిలెన్స్, ఫోరెన్సిక్ విభాగాల బృందం ఎస్పీ నేతృత్వంలో బంగ్లాను పరిశీలించింది. పరిశీలన సమయంలో సాక్ష్యాలను రూపుమాపే చర్యలు చేపట్టరాదని, పరిశీలన వీడియో తీసి సమర్పించాలని ఇదివరకే కోర్టు ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే.

### పదోన్నతులు కల్పించొద్దు

ఐసిఎఫ్, మార్చి 7: అధ్యాపకులు, ఉద్యోగులకు పదోన్నతులు కల్పించరాదని రాష్ట్ర ఉన్నత విద్య ప్రధాన కార్యదర్శి కార్తీక్ మదురై కామరాజ్ విశ్వవిద్యాలయానికి ఉత్తర్వులు జారీచేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు వేతనం అందజేసేందుకు డిసెంబరు, జనవరి నెలలకు రూ.22.58 కోట్లను ఈ విశ్వవిద్యాలయం ప్రభుత్వాన్ని కోరగా, రూ.30.26 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. అందులో ఈ ఏడాది ఫిబ్రవరి నెల వేతనాన్ని సూచించింది. అదే సమయంలో పింఛన్, ఉద్యోగుల వేతనాలను మరోమారు పరిశీలన చేయాల్సి ఉందని, అప్పటివరకు ఎలాంటి పదోన్నతులు కల్పించరాదని నిబంధన విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

### వైద్య కౌన్సెల్‌కు కొత్త భవనం

ఐసిఎఫ్, మార్చి 7: స్థానిక పురుషవాక్కంలో రాష్ట్ర వైద్య కౌన్సెల్ కార్యాలయానికి కొత్త భవనం నిర్మించారు. అరుంబాక్కంలో వైద్య కౌన్సిల్ కార్యాలయం ఉండగా, ఇందులో 1.80 లక్షల మంది ఉద్యోగులు నమోదుచేసుకొని వైద్యం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఇతర రాష్ట్రాల్లో ఉన్న వైద్యులు లబ్ధిపొందేలా పురుషవాక్కం పూందమల్లి హైరోడ్డులో రూ.46 కోట్లతో నాలుగు అంతస్తులతో వైద్య కౌన్సెల్‌కు కొత్త భవనం నిర్మించారు. ఎగ్మూర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ప్రయోజనకరంగా ఉంటుందని ఆరోగ్యశాఖ కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ బేదీ తెలిపారు.

### రూ.20 కోట్లతో వండలూరు-సింగపెరుమాళ్ రహదారి విస్తరణ

ప్యారీస్, మార్చి 7: నగర శివారు ప్రాంతాలైన వండలూరు-సింగపెరుమాళ్ మధ్య రూ.20 కోట్లతో జీఎస్‌టీ రోడ్డును విస్తరింపజేయనున్నారు.ఈమార్గంలో ఏడు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటుచేసేందుకు టెండర్లు ఆహ్వానించినట్లు రహదారుల శాఖ అధికారులు తెలిపారు. వండలూరు, సింగపెరుమాళ్ కోయిల్ రైల్వే స్టేషన్లు, తైలావరంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల, టెక్నికల్ పార్క్, మరమలైనగర్ ప్రాంతాలను ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఎంపిక చేశారు. ఈ ప్రాంతాల్లో నిర్మాణపనులు మరో వారం రోజుల్లో చేపట్టి ఎనిమిది నెలల వ్యవధిలో పూర్తిచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

### డీఎంకే కూటమి పార్టీలు అన్నాడీఎంకేతో చేరవు

● మంత్రి దురైమురుగన్

పెరంబూర్, మార్చి 7: డీఎంకే కూటమి పార్టీలు అన్నాడీఎంకేతో జతకట్టే అవకాశమే లేదని డీఎంకే ప్రధాన కార్యదర్శి, మంత్రి దురై మురుగన్ తెలిపారు. వేలూరు ఎంపీ పదవి మళ్లీ కేటాయించాలని కోరుతూ మంత్రి కుమారుడు కదిర్ ఆనంద్ గురువారం పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఆయనతో పాటు వచ్చిన మంత్రి మీడియాతో మాట్లాడుతూ... తుఫాను, వరద బాధిత ప్రజలకు రాష్ట్రప్రభుత్వం ఎలాంటి సహాయం చేయలేదని ప్రధాని మోదీ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వరద బాధితులను ఆదుకొనేందుకు కనీసం ఆకాశంలో అయినా విహరించి వరద పరిస్థితులు పరిశీలించని వారు రాష్ట్రప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని మంత్రి తెలిపారు.

### సైబర్ క్రైం రీల్స్ పోటీలు

ఐసిఎఫ్, మార్చి 7: ప్రజలు, విద్యార్థులు ఆన్‌లైన్ లోన్ యాప్, ఆన్‌లైన్ వివాహ ఛీటింగ్, కొరియర్ మోసాలు, సామాజిక మాధ్యమాల్లో నకిలీ స్వయంవరాలు, ఆన్‌లైన్ పార్ట్‌టైం ఉద్యోగాల మోసాలపై రీల్స్ పోటీల్లో పాల్గొని నగదు బహుమతి పొందాలని రాష్ట్ర సైబర్ క్రైం పోలీసు విభాగం ప్రకటించింది. ఔత్సాహికులు గూగుల్ ఫాం ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 14వ తేది వరకు నమోదుచేసుకోవచ్చు. తమ రీల్స్‌ను 30 సెకన్లలోపు ప్రకటించిన శీర్షికల్లో తయారుచేసి పంపించాలి. గూగుల్ డ్రైవ్‌లో అప్‌లోడ్ చేసి దానికి సంబంధించిన లింక్‌ను గూగుల్ ఫాంలో షేర్ చేయాలి. విజేతలను ఈ నెల 18వ తేది ప్రకటించి, మొదటి బహుమతి రూ.25 వేలు, రెండవ బహుమతి రూ.20 వేలు, మూడవ బహుమతి రూ.15 వేలు అందజేస్తారు. ఇతర వివరాలకు సైబర్ క్రైం వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

### వేలూరు నుంచి నటుడు మన్సూర్ అలీఖాన్ పోటీ

ప్యారీస్, మార్చి 7: లోక్‌సభ ఎన్నికల్లో సినీనటుడు మన్సూర్ అలీఖాన్ వేలూరు నియోజకవర్గం నుంచి పోటీచేయనున్నారు. ఆయన ఇండియా జననాయగ పులిగల్ అనే పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. ఆ పార్టీ తొలి మహానాడు గత నెల నగరంలో నిర్వహించిన మన్సూర్ అలీఖాన్ ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు. తిరువణ్ణామలై, శ్రీ పెరుంబుదూర్, దిండుగల్, ఆరణి, వేలూరు ఎంపీ నియోజకవర్గాల్లో పోటీచేయనున్న అభ్యర్థుల జాబితాను పార్టీ కార్యాలయం గురువారం విడుదల చేసింది. అందులో మన్సూర్ అలీఖాన్ వేలూరు నుంచి పోటీచేయనున్నట్లు తెలిపారు.

### టీఎంసీ సీట్ల సర్దుబాటు కమిటీ నియామకం

ప్యారీస్, మార్చి 7: తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) ఆధ్వర్యంలో ఆరుగురితో కూడిన సీట్ల సర్దుబాటు కమిటీని నియమించినట్లు ఆ పార్టీ అధ్యక్షుడు జీకే వాసన్ ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమి తరఫున టీఎంసీ పోటీచేయనున్న నేపథ్యంలో, నియోజకవర్గాల కేటాయింపుపై ఆ పార్టీ నేతలు రెండు సార్లు బీజేపీ నాయకులతో సమావేశమై చర్చించా రు. ఇదిలా ఉండగా, సీట్ల సర్దుబాటు చర్చల నిమిత్తం మాజీ ఎమ్మెల్యే విడియల్ శేఖర్, శక్తివడివేల్, రంగరాజన్, మునవర్ భాష, రాంబాబు, వెంకటేశన్‌లను నియమించినట్లు పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది.

### మురుగన్ శ్రీలంక ఎంబసీకి వెళ్లేందుకు అనుమతించండి

పెరంబూర్, మార్చి 7: తన భర్త మురుగన్‌ను శ్రీలంక దౌత్య కార్యాలయం వెళ్లేందుకు అనుమతించాలని కోరుతూ నళిని మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. శ్రీలంక వెళ్లేందుకు పాస్‌పోర్ట్ కోసం జరిగే ఇంటర్వ్యూకు ఆయనను అనుమతించాలని పిటిషన్‌లో కోరారు. మురుగన్ తిరుచ్చి ప్రత్యేక శిబిరంలో ఉండడంతో జనవరి 30వ తేది ఇంటర్వ్యూకు వెళ్లేందుకు అనుమతించలేదని నళిని పేర్కొన్నారు. అలాగే, చెన్నైలోని శ్రీలంక దౌత్యకార్యాలయంలో ఇంటర్వ్యూకు సమయం కేటాయించినా ఆయనను అనుమతించలేదని నళిని పిటిషన్‌లో పేర్కొన్నారు.

### నిబంధనలు ఉల్లఘించిన వాహనాలు స్వాధీనం

ఐసిఎఫ్, మార్చి 7: స్థానిక షోలింగనల్లూర్, పరిసర ప్రాంతాల్లో నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ అరుణాచలం నేతృత్వంలో పోలీసులు రెండు రోజులుగా వాహనతనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన రెండు ఆటోలు, 12 కార్లు, మోటారు సైకిళ్లు స్వాధీనపరచుకున్నారు.

### డ్రగ్ స్మగ్లింగ్ ముఠా నాయకుడి అరెస్టు

ప్యారీస్, మార్చి 7: డ్రగ్స్ స్మగ్లింగ్ ముఠా నాయకుడిని గురువారం తెల్లవారుజామున గుజరాత్‌లో అరెస్ట్ చేసినట్లు నామక్కల్ పోలీసులు పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలో గంజాయి అక్రమ తరలింపు, విక్రయాలు అడ్డుకొనేలా పోలీసు శాఖ అన్ని జిల్లాల్లో తనిఖీలు ముమ్మరం చేసింది. దీంతో ఎవరికి అనుమానం రాకుండా మత్తుబిళ్లల విక్రయాలను సంఘవిద్రోహులు గుట్టుగా సాగిస్తున్నారు. దీనిపై అందిన సమాచారంతో నామక్కల్ జిల్లా పళ్లిపాళయం పోలీసులు విచారణ జరిపి గౌతమ్ (32) అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. అతడి నుంచి సేకరించిన సమాచారంతో ఈరోడ్‌లో నివసిస్తూ మత్తుబిళ్లలు విక్రయించిన రాజస్థాన్‌కు చెందిన భరత్‌కుమార్, అశోక్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో. గుజరాత్‌కు చెందిన సిద్ధిక్ చౌదరి డ్రగ్స్ స్మగ్లింగ్ ముఠా నాయకుడిగా వ్యవహరించి పళ్లిపాళయం, ఈరోడ్, నామక్కల్ తదితర జిల్లాల్లో 12 మంది ఏజెంట్లను నియమించినట్లు తెలిసింది. ఆ 12 మంది వివరాలు సేకరించి అదుపులోకి తీసుకున్న పోలీసులు, బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు కోయంబత్తూర్ నుంచి గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్ నగరానికి రాత్రి 11 గంటలకు చేరుకున్నారు. అనంతరం స్థానిక పోలీసుల సహకారంతో అతడి ఇంట్లో ఉన్న సిద్ధిక్ చౌదరిని అరెస్ట్ చేసి రాష్ట్రానికి తీసుకొస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### రూ.50 లక్షల మోసం... వ్యాపారవేత్త అరెస్టు

ప్యారీస్, మార్చి 7: వ్యాపారం అభివృద్ధి నిమిత్తం రూ.50 లక్షలు రుణం తీసుకొని మోసం చేసిన వెస్ట్ తాంబరం శ్రీరామ్ నగర్‌కు చెందిన రమేష్ (40)ను పోలీసులు అరెస్ట్ చేశారు. మాధవరం ప్రాంతానికి చెందిన ముత్తుకృష్ణన్ లోటస్ కాలనీలో అల్యూమినియం కంపెనీ నడుపుతున్నాడు. అదే ప్రాంతంలో భవన నిర్మాణ సామగ్రి డిజైనింగ్ కంపెనీ నిర్వహిస్తున్న రమేష్, తన వ్యాపారాభివృద్ధికి ముత్తుకృష్ణన్ వద్ద అప్పుగా తీసుకున్న రూ.50 లక్షలు తిరిగి చెల్లించకుండా మోసం చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. మాధవరం ఇన్‌స్పెక్టర్ భూపాలన్ గురువారం ఉదయం రమేష్‌ను అరెస్ట్ చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

### ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన టీచర్ సస్పెండ్

పెరంబూర్, మార్చి 7: ప్రభుత్వ వ్యతిరేకంగా సోషల్ మీడియాలో వ్యాఖ్యలు పోస్ట్ చేసిన టీచర్‌పై సస్పెన్షన్ వేటుపడింది. నెల్లికుప్పం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉమామహేశ్వరిని సస్పెండ్ చేస్తూ చెంగల్పట్టు జిల్లా విద్యాధికారి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ ఉద్యోగుల నిబంధనలు అతిక్రమించి ఆమె వ్యాఖ్యలు పోస్ట్ చేయడంతో ఈ చర్యలు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### బృహదీశ్వరాలయ కందకంలో అగ్ని ప్రమాదం



చెన్నై, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తంజావూరులో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బృహదీశ్వరాలయ కందకంలో గురువారం ఉద యం అగ్ని ప్రమాదం సం భవించింది. ఉన్నట్టుండి మంటలు చెలరేగి ఆ ప్రాంతమంతా పొగలు కమ్ముకున్నాయి. ఆ ఆలయ ముందుభాగంలో ఉన్న కందకంలో గతంలో నీటి నిల్వలు ఉండేవి. ప్రస్తుతం కందకంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. కందకం గోడలు సైతం దెబ్బతిన్నాయి. కందకం పొడవునా చెత్తకుప్పలతో నిండిపోయాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఉన్నట్టుండి కందకంలో మంటలు చెలరేగాయి. క్షణాల్లో అందులోని చెత్తాచెదారానికి నిప్పంటుకుని నలువైపులా దట్టమైన పొగలు వ్యాపించాయి. భక్తులు గమనించి వెంటనే అగ్నిమాపక సిబ్బందికి ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక దళం సభ్యులు ఫైరింజన్‌తో వెళ్ళి పోరాడి మంటలను ఆర్పివేశారు.

### అశ్వ వాహనంపై దేవదేవుడి దివ్య స్వరూపం



అశ్వవాహన సేవలో స్వామి, అమ్మవార్లకు హారతులు

నాగలాపురం, మార్చి 7: మండలంలోని సురుటుపల్లె పళ్లికొండేశ్వరాలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు అశ్వ వాహనంపై తిరువీధుల్లో విహరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి వచ్చారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుక్కుల్ పరివార దేవతలకు అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆలయ యాగశాల మండపంలో శాస్త్రోక్తంగా యాగశాల పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని మూలస్థాన మూర్తులు శ్రీవాల్మీకేశ్వర స్వామి, మరగదాంబికా అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నక్షత్ర హారతి, కుంభ హారతి, మహా హారతులిచ్చారు. వాల్మీకేశ్వరుడు సతి పార్వతీ దేవితో అశ్వ వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో విహరించారు. పూజలకు తమిళనాడు ఊత్తుకోటకి చెందిన ఎంఆర్. తమిళరశి, టి.ఆర్ మోహన్ కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు.

## ఆరు పార్టీలతో అన్నాడీఎంకే మెగా కూటమి

చెన్నై, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) తాను చెప్పినట్లుగానే ఓటు బ్యాంక్ కలిగిన పార్టీలతో మెగా కూటమి ఏర్పాటు చేసుకుని లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. డీఎంకేలో సీట్ల సర్దుబాట్ల చర్చలు కొలిక్కిరాకముందే ఈపీఎస్ తన కూటమిని స్థిరపరచుకున్నారు. ఎన్డీయే కూటమి నుండి వైదొలగిన తర్వాత బీజేపీ కూటమిలో చేరమంటూ వచ్చిన వత్తిళ్లను పక్కన బెట్టి ఇతర పార్టీలతో పొత్తులు ఖరారు చేసుకున్నారు. ఈ రెండు పార్టీలు బలమైన కూటమి ఏర్పాటు చేసుకుని పోటీకి దిగుతుండగా, బీజేపీ చిన్నాచితక పార్టీలతో పొత్తు పెట్టుకుని బరిలోకి దిగనుంది. ఇక కాస్తోకూస్తో ఓటు బ్యాంకు కలిగిన శీమాన్ నాయకత్వంలోని నామ్ తమిళర్ కట్చి ఒంటరి పోరుకే మొగ్గు చూపింది. దీంతో లోక్‌సభ ఎన్నికలు పేరుకు చతుర్ముఖ పోటీ అయినప్పటికీ, ముఖ్యంగా డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ కూటముల మధ్యేనని స్పష్టమవుతోంది. అయితే డీఎంకేకు ధీటుగా బలమైన కూటమి ఏర్పాటు చేసుకు న్న అన్నాడీఎంకే లోక్‌సభ ఎన్నికల్లో కొన్ని సీట్లను గెలుచుకునే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అందుకు తగినట్లుగానే ఈపీఎస్ ఆచితూచి పీఎంకే, డీఎండీకే పార్టీలను తనవైపునకు తిప్పుకోగలిగారు. అంతేకాకుండా పుదియతమిళగం, ఎస్డీపీఐ, పురట్చి భారతం, ఇండియన్ ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలను కూడా కూటమిలోకి చేర్చుకున్నారు. ఈ ఆరుపార్టీలలో ఐదింటితో సీట్ల సర్దుబాట్లపై చర్చలు దాదాపు పూర్తికావచ్చాయి. ఇక పీఎంకేతో మాత్రమే చర్చలు ప్రారంభం కావాల్సి ఉంది. అన్నాడీఎంకే కూటమిలో పీఎంకే చేరటం వల్ల ఉత్తరాది జిల్లాల్లో వన్నియార్ల ఓట్లను పొందటానికి వీలవుతుంది. ఇదే విధంగా డీఎండీకేకి కూడా విరుదాచలం, విరుదునగర్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేకమైన ఓటు బ్యాంకుంది. పురట్చి భారతం పార్టీకి చెన్నై పరిసర ప్రాంతాల్లో ఉత్తరాది జిల్లాల్లో ఓటు బ్యాంకు ఉంది. ఈ అంశాలను పరిశీలించినట్లయితే పాలకపక్షమైన డీఎంకే కూటమిని ఈపీఎస్ బలమైన కూటమితో ఢీకొననున్నారని స్పష్టమవుతోంది. ఇక అన్నాడీఎంకే కూటమిలో కొత్తగా చేరిన పార్టీలకు సీట్ల కేటాయింపు సులువగా జరిగే అవకాశాలున్నాయి. పీఎంకే పది సీట్లడిగితే ఏడు ఇచ్చేందుకు ఈపీఎస్ అంగీకరించారు. డీఎండీకే ఏడు నియోజకవర్గాలు అడిగితే నాలుగు కేటాయించేందుకు సమ్మతించారు. మలివిడత చర్చల్లో ఈ రెండు పార్టీలకు తలా ఒక సీటు గానీ, లేదా రాజ్యసభ సీటుగాని దక్కే అవకాశం ఉంది. ఏది ఏమైనప్పటికీ మిత్రపక్షాలు ఆశించిన రీతిలోనే కాస్త అటుఇటుగా సీట్ల కేటాయింపులు సాఫీగా జరుగుతుందని అన్నాడీఎంకే సీనియర్ నేతలు చెబుతున్నారు. ఎస్డీపీఐ రెండు సీట్లు, పురట్చి భారతం రెండు సీట్లు అడుగుతుండగా వాటికి తలా ఒక సీటు ఖరారు చేస్తారని తెలుస్తోంది. ఈ గణాంకాల ప్రకారం అన్నాడీఎంకే ఈసారి 25 స్థానాలకు పైగా పోటీ చేసే అవకాశం ఉంది. ఒకటి రెండు రోజులలో మిత్రపక్షాల సీట్ల కేటాయింపులు ఖరారవుతాయని, ఆ తర్వాత ఈపీఎస్ పార్టీ సీనియర్ నాయకులతో, మిత్రపక్షాల నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. డీఎంకే కంటే ముందుగానే ఈ ప్రచారం సాగుతుందని అన్నాడీఎంకే సీనియర్ నాయకులు పేర్కొన్నారు.



ఆసక్తి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదు. ఎన్ని డిగ్రీలనైనా సంపాదించవచ్చు. ఎంత జ్ఞానాన్నైనా సముపార్జించి, సమాజ శ్రేయస్సుకు ఉపయోగిస్తే అది సార్థకత చెందుతుంది. దానికి ఉదాహరణే ఆ ప్రకృతి వైద్యురాలు. ఆమె ఒక శక్తి కాదు...అనేక శక్తుల సమ్మేళనం, ఎన్నో రంగాల్లో అనుభవం...మరెన్నో రంగాల్లో నైపుణ్యం ఆమె అభిరుచికి ఆసక్తి జోడై ఎన్నో కోర్సులు చదివింది. వాటికి తోడైంది అనుభవం. అదే రోగులపాలిటి ఓ వరమైంది.. జీవనశైలికి సంబంధించిన రుగ్మతలకు మందులతో పనిలేని ప్రకృతి వైద్యం ఆమె విధానం. ఒత్తిడిని అధిగమించేందుకు, ఉద్వేగాలను నియంత్రించేందుకు, సలహాలు, సూచనలందించే నిపుణత కలిగిన సలహాదారు ఆమె. తన వైద్య విధానంతో రోగులకు ఉపశమనం కలిగించే ఆమే డాక్టర్ రోజా గురుమూర్తి. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె ప్రస్థానం మీ కోసం...

- వేళచ్చేరి

నేడు మహిళా దినోత్సవం





పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను వివరిస్తూ...

శ్రీరామచంద్ర కళాశాలల్లో మానసిక ఒత్తిడి అధిగమించేలా శిక్షణ...

## యోగా, ప్రకృతి వైద్యం...

# రోగులకు ఉపశమనం

- ప్రకృతి వైద్య నిపుణురాలు డాక్టర్ రోజా గురుమూర్తి

రోజా పుట్టింది హైదరాబాదులో, పెరిగింది చెన్నైలో. చిల్డ్రన్స్ గార్డెన్ స్కూలులో పాఠశా విద్యాభ్యాసం, క్వీన్‌మేరీస్ కాలేజీలో పీయూసీ చదివారు. తండ్రి లక్ష్మీ నారాయణ్, తల్లి రాజ్యలక్ష్మి. ఇద్దరూ డాక్టర్లే. ఇద్దరూ ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తులే. తల్లి ప్రస్తుతం అడయార్‌లో క్లినిక్ నడుపుతున్నారు. బాల్యం నుంచి డాక్టర్ కావాలనుకున్న రోజా తల్లిదండ్రుల బాటలోనే నడిచారు. ప్రకృతి వైద్యురాలైనారు.

### వ్యక్తిత్వం...

డాక్టర్ రోజా చాలా నిబద్ధత కలిగిన మహిళ. వృత్తి పట్ల అంకితభావం, సమయపాలన, నైతిక విలువల పట్ల గౌరవ భావం, సేవానిరతి కలిగిన ఉన్నతాదర్శాలను పాటించే ఆదర్శ వనిత. సమాజసేవ ఆమెకు ఇష్టమైన కాలక్షేపం. పిల్లలకు నైతికవిలువలు, మానవీయ విలువలకు సంబంధించిన కథలు చెప్పడం, ఆమెలోని మరో కోణం. బాల్యం నుంచి తెలుగు సాహిత్యంపై ఆసక్తి ఉన్న ఆమెకు శ్రీనాథుడు నచ్చిన కవి. శ్రీనాథుడి పద్యాలు, చాటువులు అలవోకగా చెప్పగలిగిన తెలుగు భాషాభిమాని. డాక్టరుగా, సలహాదారుగా డా.రోజా ఇప్పటివరకు ఎన్నో సేవలందించారు. చెన్నైలోని ఉల్లాస్ ట్రస్ట్ ద్వారా ఎంతోమంది యువతీ యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. 9, 10 తరగతులు చదివే కార్పొరేషన్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంగ్లీషులో మాట్లాడడం నేర్పి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింపజేశారు. అంతేకాదు, వారికి నైతిక విలువలను కథల ద్వారా తెలియజేసేవారు.

14 సంవత్సరాల పాటు మరో ఎన్జీవోతో కలసి మానసిక ఒత్తిడితో ఉన్న వారికి, ఆత్మహత్యలకు పాల్పడాలనే ఆలోచన కలిగిన వారికి పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు, ఎందరికో కౌన్సెలింగ్ ఇచ్చారు. వాలంటీర్‌గా సేవలందించి వారి భవితకు బాటలు వేశారు. ఈ ఎన్జీవోతో కలసి కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగుల మానసిక ఒత్తిడి తగ్గించే కార్యక్రమాలు ఎన్నో నిర్వహించారు. 1990వ సంవత్సరం నుంచి 2001 వరకు హైదరాబాదులో సేవా సంస్థలో వలంటీర్‌గా, కౌన్సెలర్‌గా సేవలందించారు. 1998 నుంచి 2002 వరకు హైదరాబాదు 'నిమ్స్'లో అంకాలజీ శాఖలో కౌన్సెలర్‌గా వ్యవహరించి, ఎందరో రోగులకు మానసిక స్థైర్యాన్నిచ్చారు. చెన్నైలోని ఇన్నర్‌వీల్ క్లబ్, చెన్నై సన్ షైన్, డిస్ట్రిక్-232కి ప్రెసిడెంట్‌గా సేవలందించి విద్యార్థులకు వ్యక్తిత్వవికాసానికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించారు. 1995 నుంచి 1999 వరకు డా.రోజా హైదరాబాదులోని రెడ్‌క్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా అండ్ నేచర్‌క్యూర్‌లో మెడికల్ ఆఫీసర్‌గా, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా పనిచేశారు. ఆ తర్వాత చెన్నైలో 'రాజు హాస్పటల్స్'లో, ఆ తర్వాత చెన్నైలోని 'ఫోర్టిస్ మలార్'లోను స్ట్రెస్ మేనేజ్‌మెంట్ కౌన్సెలర్‌గా సేవలందించారు. ఆ తర్వాత చెన్నై నుంగంబాక్కంలోని 'మెడికల్ పార్క్'లో స్ట్రెస్ మేనేజ్‌మెంట్ కౌన్సిలర్‌గా పనిచేశారు. 2002 నుంచి సైదాపేటలోని శ్రీ నగర్ కాలనీలో ఆమె వెల్‌నెస్ సెంటర్‌ని నడుపుతున్నారు.

### విద్యానేపథ్యం....

హైదరాబాదులోని 'గాంధీ నేచర్ క్యూర్ కాలేజీ'లో నేచురోపతి, యోగిక్ సైన్సెస్‌లో పట్టభద్రురాలయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బీ.ఏ డిగ్రీ అందుకున్నారు. కౌన్సిలింగ్, సైకోథెరపీ ముఖ్యాంశాలుగా ఎంఎస్సీ చేశారు. ప్రివెన్‌టివ్ అండ్ ప్రొమోటివ్ హెల్త్ కేర్‌లో పీజీ డిప్లొమో అందుకున్నారు. న్యూఢిల్లీలోని 'ఇగ్నో' నుంచి మేనేజ్‌మెంట్‌లో పీజీ డిప్లొమో చేశారు. బెంగుళూరులోని 'వ్యాస' అనే శిక్షణ సంస్థలో చేరి సర్టిఫికెట్ కోర్సు చేశారు. ఇన్ని విద్యార్హతలు కలిగిన రోజా 13 ఏళ్ల పాటు ఎస్ఆర్ఎస్ కంపెనీలో పనిచేశారు. రోజా భర్త గురుమూర్తి బిజినెస్‌మాన్. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. తెలుగు సాహిత్యంపై మక్కువ. తెలుగు, ఇంగ్లీషు భాషల్లో కవితలు రాయటంతో పాటు ఆరోగ్యానికి సంబంధించి, తన వృత్తికి సంబంధించి ఎన్నో ఆర్టికల్స్ రాస్తుంటారు.



భర్త గురుమూర్తితో...

### అందించే సేవలు...

దీర్ఘకాలికంగా ఉన్న మధుమేహం, రక్తపోటు, అధిక బరువు, ఒత్తిడి, జీర్ణ సంబంధిత రుగ్మతలు, నిద్రలేమి, స్పాండిలైటిస్, సైనస్, మైగ్రేన్, మెనోపాజ్, సంతానలేమి మొదలైన సమస్యలకు నేచురోపతి, యోగా కలిపి పరిష్కారమార్గాలు చూపించి మందులు వాడే అవసరం లేకుండా ఉపశమనం కల్గించడం డా.రోజా వైద్య విధానం. ఇంకా వెబనిర్స్, ఆన్‌లైన్ సెషన్స్ ద్వారా వివిధ వయసుల వారి జీవనశైలికి సంబంధించిన రుగ్మతలను నివారించే విధానం, ఆరోగ్యాన్ని కాపాడుకొనే విధానం గురించి వివరిస్తారు డాక్టర్ రోజా.ఉద్రేకాలు, ఉద్వేగాల నియంత్రణ గురించి మెరుగైన సలహాలిస్తారు ఆమె. ఎన్నో ఆస్పత్రుల్లో ఆపరేషన్లు అయిన రోగులు త్వరగా కోలుకొనేందుకు ప్రకృతి వైద్యం, యోగా , కన్సెల్టెన్సీ ద్వారా తగిన సూచనలిచ్చి వారి ఆరోగ్యాలు మెరుగుపరిచేందుకు కృషిచేస్తున్నారు రోజా.. "ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతివ్వాలి. శారీరక, మానసిక ఆరోగ్యానికి అందరూ సమయం వెచ్చించాలి. జబ్బుల బారిన పడకుండా ముందే జాగ్రత్తలు తీసుకోవడం మంచిది." అని డాక్టర్ రోజా 'ఆంధ్రజ్యోతి'తో తన మనోభావాలను పంచుకున్నారు..



దంత వైద్య విద్యార్థినులకు యోగా, ప్రకృతి వైద్యంపై వివరిస్తూ...

### మహిళా దినోత్సవం సందర్భంగా నేతల శుభాకాంక్షలు

ప్యారీస్, మార్చి 7: రాష్ట్రంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోనున్న సందర్భంగా గవర్నర్, ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత సహా పలు పార్టీల నాయకులు మహిళలకు శుభాకాంక్షలు తెలుపుతూ వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. సమాజంలో పురుషులతో పాటు మహిళలకు కూడా సమాన హక్కులు కల్పించడంతో పాటు వారి సంక్షేమం దిశగా డీఎంకే ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని ముఖ్యమంత్రి స్టాలిన్ తన సందేశంలో తెలిపారు. చమటోడ్చి కుటుంబాలను పోషిస్తున్న గృహిణుల హక్కులను కాపాడడంలో, స్త్రీమూర్తులను గౌరవించడంలో అన్నాడీఎంకే ఎప్పుడూ ముందుంటుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. రాజకీయాలు శాసించే స్థాయికి మహిళా మణులు ఎదగడం శుభపరిణామమని అన్నాడీఎంకే బహిష్కృతనేత వీకే శశికళ తెలిపారు. తమిళ మహాకవి సుబ్రమణ్య భారతియార్ సృష్టిలో మహిళలు ఉన్నతవంతులని పొగుడుతూ రాసిన పాటలను ప్రతి ఒక్కరు గుర్తుచేసుకోవాలని, స్త్రీలను అభివృద్ధి బాటలో నడిపించేందుకు మనమందరం కలసి కృషిచేయాలని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## 'ఉత్తమ నటి' అవార్డు అందుకున్న జ్యోతిక



జ్యోతికకు అవార్డును అందజేస్తున్న మంత్రులు సుబ్రమణ్యం, స్వామినాథన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 2015 సంవత్సరం సినీ అవార్డుల్లో ఉత్తమ నటిగా ఎంపికైన జ్యోతిక మంత్రులు సుబ్రమణ్యం, స్వామినాథన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.. '36 వయదినిలే' చిత్రానికిగాను ఆమెకు బెస్ట్ హీరోయిన్ అవార్డు వరించింది. బుధవారం రాత్రి ప్యారీస్‌లోని రాజా అన్నామలై మండ్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో 2015లో ఎంపికైన నటీనటులు అవార్డులను స్వీకరించారు. వీరిలో జ్యోతికతో పాటు దర్శకుడు మోహన్ రాజా, దర్శకురాలు సుధా కొంగరా, హీరో గౌతం కార్తీక్ తదితరులు ఉన్నారు. '36 వయదినిలే' చిత్రం ద్వారా జ్యోతిక రీ ఎంట్రీ ఇచ్చారు. ఈ సినిమాకు ఉత్తమ నటి, ఉత్తమ చిత్రంతో సహా ఏకంగా ఏడు అవార్డులు దక్కించుకుంది. అదేవిధంగా జయం రవి నటించిన 'తనీ ఒరువన్' సినిమాకు ఉత్తమ చిత్రంతో సహా ఆరు అవార్డులను గెలుచుకుంది. ఆర్.మాధవన్ నటించిన 'ఇరుదిచుట్రు' సినిమా ఉత్తమ నటుడు, ఉత్తమ దర్శకుడుతో పాటు ఆరు అవార్డులను గెలుచుకుంది. అవార్డులను స్వీకరించిన వారికి బంగారు పతకంతో పాటు, చెక్కు, ప్రశంసా పత్రాలను మంత్రులు అందజేసి, వారిని అభినందిచారు.

చిత్రజ్యోతి

## మహిళా సినీ జర్నలిస్టులతో కలిసి సాక్షి 'ఉమెన్స్ డే' వేడుకలు

ప్రముఖ హీరోయిన్ సాక్షి అగర్వాల్ మహిళా సినీ జర్నలిస్టులతో కలిసి మహిళా దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. 'కాలా', 'విశ్వాసం, 'అరణ్మనై-3' 'టెడీ', 'బహీరా' వంటి అనేక చిత్రాల్లో నటించి తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న సాక్షి అగర్వాల్.. ఫిట్‌నెస్, ఫ్యాషన్ తదితర అంశాలపై అధిక ఆసక్తి చూపుతుంటుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 8వ తేదీ ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే కావడంతో ఆమె ఈ వేడుకలను తమిళ సినీ పాత్రికేయులతో కలిసి జరుపుకున్నారు. వారికి మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సాక్షి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా తన విజయగాథను ఆమె జర్నలిస్టులకు వివరించారు. అలాగే, జర్నలిస్టులు కూడా తమ జీవితాల్లో ఎదురైన అడ్డంకులను ఎలా అధిగమించాలో ఆమెతో పంచుకున్నారు.



మహిళా జర్నలిస్టులతో సాక్షి అగర్వాల్

## 25 నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 'నీట్' శిక్షణ

పెరంబూర్, మార్చి 7: రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ప్లస్ వన్, ప్లస్ టూ విద్యార్థులకు జేఈఈ, నీట్ ప్రవేశ పరీక్షలకు సంబంధించిన శిక్షణా తరగతులు ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్య డైరెక్టర్ కె.అరివొళి, జిల్లా ప్రధాన విద్యాధికారులకు ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న ప్లస్ వన్, ప్లస్ టూ విద్యార్థులకు గత నవంబరు నుంచి ఫిబ్రవరి వరకు పాఠశాల స్థాయిలో శిక్షణ ఇచ్చామన్నారు. తాజాగా, పబ్లిక్ పరీక్షలు ముగించిన ప్లస్ టూ విద్యార్థులకు విద్య జిల్లాస్థాయిలో ఈ నెల 25 నుంచి మే 2వ తేది వరకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఈ శిక్షణా తరగతుల మార్గదర్శకాలు ఇలా ఉన్నాయి...

- ఒక విద్య జిల్లాలో కనిష్టంగా 2 శిక్షణా కేంద్రాల ఏర్పాటు.
- ఒక్కో కేంద్రంలో 40 విద్యార్థుల చొప్పున అవసరమైతే అదనపు శిక్షణా కేంద్రాల ఏర్పాటు.
- ఇంటర్నెట్, స్మార్ట్ తరగతి గదులున్న పాఠశాలల్లో శిక్షణా కేంద్రాలు ఏర్పాటు.
- తమిళం, ఇంగ్లీషు, సైన్స్, సోషల్ తదితర నాలుగు పాఠ్యాంశాల్లో తరగతులు నిర్వహించాలి.
- సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9.15 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు తరగతుల నిర్వహణ.
- శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రవాణా ఛార్జీలు అందిస్తారు.
- ప్రతి శనివారం రివిజన్ పరీక్షలు నిర్వహించాలి.

## అన్నాడీఎంకేలో చేరిన సిమ్లా ముత్తుచోళన్

పెరంబూర్, మార్చి 7: మాజీ మంత్రి ఎస్పీ సర్గుణపాండ్యన్ కోడలు సిమ్లా ముత్తుచోళన్ డీఎంకే నుంచి వైదొలిగి అన్నాడీఎంకేలో చేరారు. ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సమక్షంలో గురువారం ఆమె అన్నాడీఎంకే తీర్థం పుచ్చుకున్నారు. కరుణానిధి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన మంత్రివర్గంలో ఉన్నవారు సర్గుణపాండ్యన్. డీఎంకే డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన ఆయన ఆర్కే నగర్ నియోజకవర్గం నుంచి పలు మార్లు విజయం సాధించారు.



పళనిస్వామికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిమ్లా ముత్తుచోళన్

## మే 17 నుంచి ఊటీ ఫ్లవర్ షో



పెరంబూర్, మార్చి 7: ప్రముఖ పర్యాటక కేంద్రం నీలగిరి జిల్లా ఊటీ బొటానికల్ పార్క్‌లో 126వ ఫ్లవర్ షో మే 17 నుంచి 22వ తేది వరకు జరుగనుంది. ప్రజలు మే నెలలో చల్లటి ప్రాంతాలకు కుటుంబాలతో వెళుతుంటారు. ఆ ప్రకారం, రాష్ట్రంలో ఊటీ, కొడైకెనాల్, ఏర్కాడు సహా పలు పర్వత ప్రాంతాలకు ప్రజలు పెద్దసంఖ్యలో వెళుతుంటారు. అలా వచ్చే వారికి మరింత ఆహ్లాదం కలిగించేలా ఉద్యానవన, వ్యవసాయ శాఖ, పర్యాటకశాఖ ఆధ్వర్యంలో పుష్ప, కాయగూరలు, సుగంధద్రవ్యాల ప్రదర్శనలు నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో, ఈ ఏడాది ఊటీలో 126వ పుష్ప ప్రదర్శన మే 17 నుంచి 22వ తేది వరకు జరుగుతుందని జిల్లా కలెక్టర్ అరుణ గురువారం తెలిపారు. అలాగే, కున్నూర్ సిమ్స్ పార్క్‌లో మే 24 నుంచి 26వ తేది వరకు 64వ పండ్ల ప్రదర్శన ఉంటుందని కలెక్టర్ తెలిపారు.



ఐఐటీ మద్రాస్ ప్రాంగణంలో ఈ- సమ్మిట్ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొని ఓ విద్యార్థినికి అవార్డును అందజేస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి



అన్నా అరివాలయంలో మాజీ మంత్రి అన్బళగన్ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మంత్రులు, పార్టీ నేతలు



తరమణిలో ప్రపంచ తమిళ పరిశోధనా సంస్థ ప్రాంగణంలో ఏర్పాటైన సభలో ప్రాచీన తమిళ సాహిత్యాలకు సంబంధించి ఆడియోలు, గ్రంథాలను ఆవిష్కరిస్తున్న సమాచార శాఖ మంత్రి సామినాథన్



రాజ్‌భవన్‌లో వెటర్నరీ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ డాక్టర్ కేఎన్ సెల్వకుమార్ పదవీ కాలాన్ని మరో యేడాదిపాటు పొడిగిస్తూ జారీ చేసిన ఉత్తర్వును అందజేస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి

## కంటే కూతుర్నే కనాలి!

- మహిళాదినోత్సవ సభలో తంగుటూరి రామకృష్ణ



మహిళా దినోత్సవ వేడుకలో వామ్ మహిళా సభ్యులు, సంస్థ గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ

ప్యారీస్, మార్చి 7 : కంటే కూతుర్నే కనాలి అని ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ (వామ్) గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ పేర్కొన్నారు. వామ్ గ్రేటర్ చెన్నై మహిళా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మెహతానగర్‌లోని వామ్ ప్రధాన కార్యాలయంలో గురువారం సాయంత్రం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీలత అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జయరాజ్ ఇంటర్నేషనల్ నిర్వాహకురాలు టీ.జయశ్రీ పాల్గొని ఆమె సంస్థ తరపున పేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీ పురుషులనే తారతమ్యాలు లేకుండా మహిళలను వామ్ సంస్థ ప్రతియేటా మహిళా దినోత్సవం సందర్భంగా గౌరవిస్తుండటం అభినందనీయమన్నారు. అనంతరం తంగుటూరి రామకృష్ణ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని, చాలా కుటుంబాల్లో కుమార్తెలను తల్లిదండ్రులను, తోబుట్టువులను కంటికి రెప్పలా కాపాడుతున్నారని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో బెల్లంకొండ సాంబశివరావు, హరినాథ్, బద్రీ నారాయణ, ఉమాజగదీస్, మహిళా సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ వనితా శశికళ ఆక్యుపంక్చర్ చికిత్స నిర్వహించారు.